


బీఆర్ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువా కప్పుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి

# బీఆర్ఎస్ మ్యానిఫెస్టోకు నీరాజనాలు

- సీఎం కేసీఆర్ హామీ ఇచ్చాడంటే తప్పక నెరవేరుతుంది..
- ప్రజాశీర్వాదంతో మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం
- ఎన్నికలప్పుడు కనబడే నాయకులను ప్రజలు నమ్మొద్దు
- ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు, అక్టోబర్ 20 : బీఆర్ఎస్ మ్యానిఫెస్టోకు ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సీఎం కేసీఆర్ ఎన్నికల్లో ఇవ్వని హామీలను కూడా నెరవేరుస్తుండడంతో ప్రజలు బీఆర్ఎస్‌ను విశ్వసిస్తున్నారన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీకే రెడ్డి కాలనీలో శుక్రవారం బీజేపీ, కాంగ్రెస్‌లకు చెందిన నాయకులు అంబుజాదేవి, శాంతమ్మ, రాధ, మాధవి, పుష్ప, బుగ్గప్ప, శేఖర్, నరేశ్, ఉదయ్, వెంకటేశ్, అమర్, వీరేశ్, ప్రశాంత్, సమీర్, ఫైజాన్, తన్వీర్‌తోసహా సుమారు 100 మంది మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్క కుటుంబానికి రైతుబీమా తరహాలో కేసీఆర్ బీమా అమలుచేస్తామన్నారు. సీఎం కేసీఆర్ హామీ ఇచ్చాడంటే తప్పకుండా నెరవేరుతుందన్న నమ్మకం ప్రజలకు ఉందన్నారు. సౌభాగ్యలక్ష్మి పథకం కింద అర్హులైన పేద మహిళలకు ప్రతి నెలా రూ.3 వేల భృతి చెల్లిస్తామన్నారు. రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. రైతుబంధును దశల వారీగా రూ.16వేలకు పెంచుతామన్నారు. పెరుగుతున్న గ్యాస్ సిలిండర్ ధరల నుంచి పేదలకు ఉపశమనం కల్పించేందుకు అర్హులైన వారికి రూ.400కు అందిస్తామన్నారు. అగ్రవర్ణ పేదల కోసం గురుకులాలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజాశీర్వాదంతోనే బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందన్నారు. లక్ష ఓట్లకు పైగా మెజార్టీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలప్పుడు మాత్రమే కనబడే నాయకులు, రెచ్చగొట్టి ఓట్లు రాబట్టాలని ప్రయత్నించే వారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కులమతాలు, గొడవలతో ఎన్నికల్లో గెలవాలనే కుట్రలు పన్నుతున్నారన్నారు. ఎన్నికలు ముగిసిన మరుసటి రోజు నుంచే గాయబ్ అయ్యేవారు ఈ ప్రాంతానికి, ప్రజలకు ఏం సేవ చేస్తారన్నారు.

***అమ్మవారికి పూజలు..***

జిల్లా కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం, బీకే రెడ్డి కాలనీలోని రెడ్డి హాస్టల్ వద్ద, న్యూప్రేమ్ నగర్‌లో, రైల్వేస్టేషన్ వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన కనకదుర్గ అమ్మవారికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో మహబూబ్‌నగర్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

# కాంగ్రెస్‌కు ఓటేస్తే 3 గంటలే కరెంట్

- సీఎం కేసీఆర్ పథకాలు దేశానికే ఆదర్శం
- నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి
- కోయిలకొండ మండలంలో ప్రచారం

కోయిలకొండ, అక్టోబర్ 20 : కాంగ్రెస్‌కు ఓటేస్తే 24 గంటల కరెంట్ పోయి.. 3 గంటలే వస్తుందని నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని జయనగర్‌తండా, దమాయపల్లి, గార్లపహాడ్, శేర్‌పల్లి, అభంగపట్నం, కానాయపల్లి, గంగ్యానాయక్ తండాలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్ణాటకలో సరిపడా కరెంట్ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు.. ఇప్పుడు మోసం చేశారంటూ మండిపడ్డారు. 6 గంటల కరెంట్ కూడా రావడం లేదని రైతులు లబోదిబోమంటున్నారన్నారు. కర్ణాటక రైతులు కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దని చెబుతున్నారన్నారు. రూ.200 ఉన్న పింఛన్‌ను సీఎం కేసీఆర్ రూ.2 వేలు చేశారన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో 'కేసీఆర్ బీమా.. ప్రతి ఇంటికి ధీమా' అద్భుతం అని అన్నారు. మండలంలోని ప్రధాన రోడ్లను డబుల్ బీటీ రహదారులుగా మర్చామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కోయిలకొండ మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామని, ఇక్కడి భూముల ధరలు పెరిగాయన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో పేట సమన్వయకర్త రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ విజయభాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణయ్య, సర్పంచులు హన్మంతు, మాధవిరెడ్డి, ఆంజనేయులు, ఎంపీటీసీ విజయలక్ష్మి, నాయకులు భీంరెడ్డి, రవి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలు పెద్ద బోగస్

- కాంగ్రెస్‌లో లెక్కకు మించిన సీఎం అభ్యర్థులు
- కుమ్ములాటల పార్టీని ప్రజలు నమ్మరు..
- నరేందర్‌రెడ్డిని ఆదరించి కారు గుర్తుకు ఓటేయాలి
- కార్యకర్తల సమావేశంలో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

కోస్గి, అక్టోబర్ 20 : కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు పెద్ద బోగస్ అని సమాచార, భూగర్భ గనుల శాఖల మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సీఎం పదవి కోసం ఎంతో మంది పోటీ పడుతున్నారని, అలాంటి కుమ్ములాటల పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కోస్గి పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలో ఆరు గ్యారెంటీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. 50 ఏండ్లుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోని కొడంగల్ నియోజకవర్గంలో కేవలం ఐదేండ్లలోనే ఎన్నో పనులు చేపట్టామన్నారు. అనునిత్యం ప్రజల్లో తిరిగే పట్నం నరేందర్‌రెడ్డి లాంటి వ్యక్తి ఎమ్మెల్యేగా కావాలా..? ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి హైదరాబాద్‌కే పరిమితమయ్యే కాంగ్రెస్ నాయకులు కావాలా అనే విషయాన్ని ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. పట్నం నరేందర్‌రెడ్డిని ఆదరించి కారుగుర్తుకు ఓటేయాలని కోరారు. రాష్ర్టాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి మాత్రమే ఓటు అడిగే హక్కు ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే తమకు శ్రీరామరక్షగా నిలుస్తుందన్నారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి గడపగడపకూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలన్నారు. కార్యకర్తలకు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. అంతకుముందు ఈజీఎస్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి మంత్రిని ఘనంగా సన్మానించారు. సమావేశంలో జెడ్పీటీసీ ప్రకాశ్‌రెడ్డి, ఎంపీపీ మధుకర్‌రావు, వైస్ ఎంపీపీ సాయిలు, మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు రాజేశ్, కౌన్సిలర్లు శ్రీనివాస్, బందెప్ప, జనార్దన్‌రెడ్డి, నాయకులు వెంకట్‌నర్సింహులు, రాజేందర్‌రెడ్డి, బాలరాజు, హుస్సేనప్ప, అమృతమ్మ, రాములు, విజయ్‌కుమార్, అనంతయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

# అభివృద్ధికి పట్టం కట్టండి

- ఎవరెన్ని కుట్రలు చేసినా అంతిమ విజయం బీఆర్ఎస్‌దే..
- రానున్న రోజుల్లో మ్యానిఫెస్టోను మించిన పథకాలు
- కార్యకర్తల సమావేశంలో మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఆత్మకూరు, అక్టోబర్ 20 : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తనను మరోసారి ఆశీర్వదించి అభివృద్ధికి పట్టం కట్టాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి కోరారు. శుక్రవారం సాయితిరుమల కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మరోమారు విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎవ్వరెన్ని కుట్రలు చేసినా, ఎన్ని అవరోధాలు సృష్టించినా అంతిమ విజయం తమదేనన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయన్నారు. ప్రజలు మరోసారి ఆశీర్వదిస్తే ఆత్మకూరును నియోజకవర్గ కేంద్రం, రెవెన్యూ డివిజన్ హోదా సాధిస్తామన్నారు. పార్టీకోసం పనిచేసే ప్రతి నాయకుడు, కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీ స్కీంలను ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ర్టాల్లో ఎందుకు అమలుచేయడం లేదని ప్రశ్నించారు. గతంలో తెలంగాణ సమస్యలపై బీఆర్ఎస్ ఎంపీలు పోరాటం చేస్తుంటే, కాంగ్రెస్ ఎంపీలు తప్పించుకొని తిరిగారన్నారు. సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోతోనే ప్రతిపక్షాల గుండెల్లో వణుకు పుట్టించాడన్నారు. అధికారంలోకి రాగానే మ్యానిఫెస్టోను మించిన పథకాలు వస్తాయన్నారు. రైతు బాంధవుడు కేసీఆర్ ముందుచూపుతో నేడు రాష్ట్రం దేశానికే అన్నంపెట్టే స్థాయికి చేరిందన్నారు. వృద్ధులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, దివ్యాంగులకు, డయాలసిస్ బాధితులకు నెలనెలా ఠంఛన్‌గా పించన్ అందుతుందన్నారు. నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఆంజనేయగౌడ్ మాట్లాడుతూ అపర చాణక్యుడు, దార్శనికుడు బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. మరోసారి కారుగుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ సర్కారుకు అవకాశం ఇవ్వాలని, లక్ష ఓట్ల మెజార్టీతో చిట్టెం రామన్నను గెలిపించాలని అభ్యర్థించారు. చిట్టెం సుచరితారెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ప్రభుత్వం పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, ఎంపీపీ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ కోటేశ్వర్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రీయాదవ్, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ శివరంజని, పీఏసీసీఎస్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అనుబంధ కమిటీల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

# ఓర్వలేక విమర్శలా?

- బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను స్వాగతిస్తున్న ప్రజలు
- సీఎం సభ సక్సెస్ కావడంతో అనవసర రాద్ధాంతం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల, అక్టోబర్ 20 : బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ జడ్చర్లలో నిర్వహించిన ప్రగతి నివేదన సభ విజయవంతం కావడంతో ప్రతిపక్ష నాయకులు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మండిపడ్డారు. జడ్చర్లలోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు. సౌభాగ్యలక్ష్మి పథకంతో నిరుపేద ఆడబిడ్డలకు రూ.3వేలు అందిచనున్నట్లు తెలిపారు. 'కేసీఆర్ బీమా.. ప్రతి ఇంటికి ధీమా'తో రాష్ట్రంలో 93 లక్షల కుటుంబాలకు లబ్ధి కలుగుతుందన్నారు. పింఛన్లను పెంచాలని తీసుకున్న నిర్ణయం చాలా గొప్పదన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి ప్రతిపక్ష నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రతి గ్రామం, పట్టణాల్లో సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామన్నారు. ఉమ్మడి జిల్లాలోనే జడ్చర్ల పట్టణం అత్యంత వేగంగా అభివృద్ధి చెందిందన్నారు. రోజురోజుకూ నలువైపులా పట్టణం విస్తరిస్తుందని, అందుకనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. గత ప్రభుత్వాల చేతకానితనం వల్లే జడ్చర్ల వెనుకబాటుకు గురైందన్నారు. ప్రజలు హాయిగా సేద తీరేందుకు ఎన్నో పార్కులను ఏర్పాటు చేశామన్నారు. జడ్చర్ల నుంచి ఎవరి టికెట్ ఇస్తారో తెలియన బీజేపీ నాయకులు సతమవుతూ.. అనవసర ఆరోపణలు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇతర పార్టీలకు చెందినవారు బీఆర్ఎస్‌లో పెద్ద ఎత్తున చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి పొరపాటున ఓటేస్తే మూడు గంటల కరెంటు వస్తునందన్నారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణీల్‌చందర్, మండలాధ్యక్షుడు బాలసుందర్‌రెడ్డి, కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, ఉమాశంకర్‌గౌడ్, పీఏసీసీఎస్ అధ్యక్షుడు మల్లేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రఘుపతిరెడ్డి, రామ్మోహన్, ముడా డైరెక్టర్ శ్రీకాంత్, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.